సర్దుబాటుపై అయ్యవారు గుర్రు!

- ఉపాధ్యాయుల సర్దుబాటులో 78 మంది
- డివిజన్ స్థాయిలో సర్దుబాటు చేయాల్సిన పోస్టులు 31
- 98 మంది రోల్ ఉన్న స్కూళ్లలో ఐదుగురు ఎస్‌జీటీల కేటాయింపు
- స్కూల్స్ ఎత్తివేత కోసమేనా అంటూ విద్యాశాఖ వర్గాల్లో చర్చ


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీవైఈఓ చంద్రమౌళీశ్వర్, పక్కన ఎంఈఓ నాయక్

మార్కాపురం టౌన్: ఉపాధ్యాయుల సర్దుబాటులో ప్రభుత్వం సరైన విధివిధానాలతో కౌన్సెలింగ్ నిర్వహించడం లేదని ఉపాధ్యాయులు గుర్రుమంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును బాహాటంగానే తూర్పారబడుతున్నారు. బుధవారం మార్కాపురం పట్టణ, మండల స్థాయి సర్దుబాటు కౌన్సెలింగ్‌ను డీవైఈఓ చంద్రమౌళీశ్వర్, ఎంఈఓ రాందాస్‌నాయక్ ఆధ్వర్యంలో డీవైఈఓ కార్యాలయంలో నిర్వహించారు. స్కూల్ అసిస్టెంట్లు 55, ఎస్‌జీటీ 23 పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించగా ఉపాధ్యాయులు హాజరయ్యారు. స్కూల్ అసిస్టెంటు మ్యాథ్స్ విభాగంలో 11 మందికిగాను 10 మంది ప్లేసుమెంట్లు పొందారు. ఫిజికల్ సైన్సులో 11కు గాను 11 మంది, బయాలజీ సైన్సులో 8 మందికి 6, ఇంగ్లిష్‌లో 8 మందికి 7, సోషల్ స్టడీస్‌లో 11కు 10, హిందీలో ఆరుగురికిగాను నలుగురు ప్లేసుమెంట్లు కోరారు. మొత్తంగా 78 మంది ఉపాధ్యాయులకుగాను 48 మంది ప్లేసుమెంట్లు పొందగా 31 మందిని సర్దుబాటు చేయాల్సి ఉంది. వీరందరినీ డివిజన్ స్థాయి కౌన్సెలింగ్‌లో సర్దుబాటు చేస్తామని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

అసంబద్ధ సర్దుబాటుకు నిరాకరణ

మార్కాపురం పట్టణ, మండల పరిధిలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ అసంబద్ధంగా ఉందంటూ ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. తెలుగు స్కూల్ అసిస్టెంటు విభాగంలో మెరిట్ కమ్ రోస్టర్ విధానాన్ని అమలుపరచాలని ఉపాధ్యాయులు కోరగా విద్యాశాఖాధికారులు ఉన్నతాధికారులతో మాట్లాడి క్లారిఫికేషన్ వచ్చిన తర్వాత కౌన్సెలింగ్ నిర్వహిస్తామనడంతో కౌన్సెలింగ్ నిర్వహించలేదు. అలాగే ప్రాథమికోన్నత పాఠశాలలో 98 మంది రోల్ ఉన్న పాఠశాలలకు ఐదుగురు ఎస్‌జీటీలను మాత్రమే కేటాయించడాన్ని ఉపాధ్యాయ సంఘ నాయకులు తప్పుబడుతున్నారు. 7 తరగతులు ఉన్న యూపీ పాఠశాలలకు ఐదుగురు ఎస్‌జీటీలు ఎలా పాఠాలు బోధిస్తారని ప్రశ్నిస్తున్నారు. మండలంలోని కందివారిపల్లి యూపీ స్కూల్లో ఏడుగురు ఉపాధ్యాయులు ఉండగా.. వారిలో ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లను వేరే పాఠశాలకు సర్దుబాటు చేశారని, ఇది మిగిలిన వారిపై భారం పెంచడమేనని మండిపడుతున్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు పేరుతో ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నారని, సరైన విధి విధానాలు రూపొందించకుండా కౌన్సెలింగ్ నిర్వహించడం తగదని టీచర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖాధికారులు సరైన విధానాలు రూపొందించి ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టకపోతే ఆందోళన చేస్తామని ఉపాధ్యాయ సంఘాలు హెచ్చరిస్తున్నాయి.


బేస్తవారిపేట: తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న మాలమహానాడు నాయకులు

ఎస్సీల వర్గీకరణ సరైన విధానం కాదు

బేస్తవారిపేట: సుప్రీంకోర్టు తీర్పు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ ఆర్టికల్ 341 ప్రకారం రాజ్యాంగ సవరణ చేయకుండా విభజించడం సరైన పద్ధతి కాదని మాల మహానాడు రాష్ట్ర జాయంట్ సెక్రటరీ గుళ్లా చిన్న సుబ్బయ్య, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మంచా సాయి అన్నారు. బుధవారం భారత్‌బంద్ కార్యక్రమంలో భాగంగా ప్రైవేట్ విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలను మూతవేయించారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. మాలమహానాడు డివిజన్ అధ్యక్షుడు చింత సురేష్, నియోజకవర్గ అధ్యక్షుడు దార్ల ప్రేమ్‌కుమార్, మండల అధ్యక్షుడు దార్ల బాబు, మిరియాల శేఖర్, లింగం ప్రభాకర్, అంబటిపూడి శ్రీను, ముడిమాల దానమ్మ, ఎంగ్రు మంజుల, నాయకులు దార్ల సూరిబాబు, గుళ్ల సంపత్‌కుమార్, పల్లపాటి ప్రభాకర్, రాజ్‌కుమార్, రవిచంద్ర పాల్గొన్నారు.

సచివాలయం ఆకస్మిక తనిఖీ

గిద్దలూరు రూరల్: మండలంలోని అంబవరం గ్రామ సచివాలయాన్ని స్థానిక తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయం సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయానికి వచ్చిన అర్జీల వివరాలు, వాటి పరిష్కారం వంటి వాటి గురించి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులతో సత్వరమే స్పందించి పనిచేసే విధంగా ప్రతి అధికారి పనిచేయాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పూర్తి సేవలు అందించాలని కోరారు. కార్యాలయంలో పనిచేసే ప్రతి ఒక్కరూ సమయానికి వస్తూ నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. రైతుల నుంచి వచ్చే రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సమస్యలు రాకుండా చూడాలన్నారు. సిబ్బందిపై ప్రజల నుంచి ఫిర్యాదులు తలెత్తకుండా చూసుకోవాలని హెచ్చరించారు.


సచివాలయం సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్

పాడి పశువులకు పౌష్టికాహారం అందించాలి

రాచర్ల: పాడి పశువులకు పౌష్టికాహారం అందించినప్పుడే పాడి దిగుబడులు పెరుగుతాయని రాచర్ల పశువైద్యాధికారి హరిబాబు అన్నారు. మండలంలోని రాచర్లఫారంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధులకు చికిత్స కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల గర్భకోశ వ్యాధులను పాడి రైతులు సకాలంలో గుర్తించి వాటిని చికిత్స చేయించుకోవాలన్నారు. సంజీవరాయునిపేట, పాదలకుంట పల్లె గ్రామాల పశువైద్యాధికారులు శ్రావణ్‌కుమార్, డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొని పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు అందించి, ఖనిజ లవణాల మిశ్రమాన్ని రైతులకు పంపిణీ చేశారు. రాచర్ల, రాచర్లఫారం గ్రామాల పాడి రైతులు పాల్గొన్నారు.


ఖనిజ లవణాల మిశ్రమాన్ని పంపిణీ చేస్తున్న హరిబాబు

పశువుల్లో గర్భకోశ వ్యాధులను నివారించాలి

తర్లుపాడు: పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధులు, సీజనల్ వ్యాధులను గుర్తించి నివారించాలని మార్కాపురం డివిజన్ పశువర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ డి. చిన్నబాలునాయక్ పేర్కొన్నారు. బుధవారం తాడివారిపల్లిలో పశు గణాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో పశు గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. మొత్తం 60 పశువులకు చికిత్స చేసి పౌష్టికాహార ప్యాకెట్లు అందించారు. పశువుల ఉచిత అంబులెన్స్(1962) సేవలను ఉపయోగించుకోవాలని వైద్యాధికారులు సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ కేవీ రాజశేఖర్‌రెడ్డి, వేములపాడు డాక్టర్ ఎ.నాగార్జునరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


పాడిరైతులకు పౌష్టికాహార ప్యాకెట్లు అందజేస్తున్న అధికారులు

క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రాచర్ల: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా ఉపాధ్యాయుడు బీఎస్ నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రం రాచర్ల కస్తూరిబా బాలికల పాఠశాలలో ఉదయం పాఠశాల విద్యార్థినులతో గంట యోగా నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే యోగా నేర్చుకోవాలన్నారు. యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని విద్యార్థులకు తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ మాలకొండమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ లేఔట్లలో రిజిస్ట్రేషన్‌లు చేయవద్దు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు నగర పంచాయతీలో కొందరు అక్రమంగా లే ఔట్లు వేశారని, అలాంటి వారి స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసేది లేదని నగర పంచాయతీ కమిషనర్ శంకర్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనధికారికంగా అనుమతులు లేకుండా కొందరు అక్రమ లేఔట్లు వేశారని, అలాంటి వారి స్థలాల సర్వే నంబర్లతో సహా ఒక జాబితా తయారు చేసి నోటీసులు జారీ చేస్తున్నామన్నారు. అక్రమ లేఔట్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ నిలిపివేయడమే కాకుండా ఆ స్థలాల్లో నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు అనధికారిక లేఔట్లల్లో స్థలాలు కొనుగోలు చేయరాదని కమిషనర్ సూచించారు.

కంభం ఎస్సైగా నరసింహారావు



ఎస్పీ దామోదర్‌తో ఎస్సై నరసింహారావు

కంభం: ఎస్సైగా బి.నరసింహారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న పులి రాజేష్ వీఆర్‌కు వెళ్లగా బేస్తవారిపేట ఎస్సైగా పనిచేస్తున్న నరసింహారావును కంభానికి బదిలీ చేసిన నేపథ్యంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను ఎస్సై నరసింహారావు మర్యాదపూర్వకంగా కలిసారు.

పొగాకు రహితంగా ఉండేందుకు కృషి చేయాలి

కంభం: పొగాకు రహిత సమాజమే ఆరోగ్య హేతువని, పొగాకు అత్యంత ప్రమాదకరమని ప్రధానోపాధ్యాయురాలు ఆకవీటి సరోజ అన్నారు. మండలంలోని హజరత్ గూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం పొగాకు వ్యతిరేక పోస్టర్లను ఆవిష్కరించి పొగాకుతో కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు సరోజ మాట్లాడుతూ పొగాకు రహిత ప్రాంతాలుగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్యాబ్ పరీక్షలు సాంకేతిక సోపానాలు

కంభం: స్థానిక గురుకుల పాఠశాలలో బుధవారం నిర్వహించిన ట్యాబ్ ఆధారిత బేస్‌లైన్ పరీక్షలను మండల విద్యాశాఖాధికారి కె.శర్వాణి పరిశీలించారు. పెన్ను, పేపర్ లేకుండా ట్యాబ్ ఆధారిత పరీక్ష నిర్వహించడం సాంకేతిక అభివృద్ధికి సూచికని, ఈ తరహా పరీక్షలు విద్యార్థులకు సాంకేతిక సోపానాలుగా నైపుణ్యాలకు బాసటగా నిలిచి ఉంటాయన్నారు. బాలికలు భయం వీడి సాంకేతికత పరిజ్ఞానాన్ని సొంతం చేసుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ చాముండేశ్వరి, మండల సమన్వయకర్త చిన్ని పద్మావతి పాల్గొన్నారు.

మూడు స్కూళ్లలో సీబీఎస్‌ఈ పరీక్షలు

కొనకనమిట్ల: ప్రభుత్వ పాఠశాలల్లో నూతనంగా ప్రారంభించిన సీబీఎస్‌ఈ విధానంలో 10వ తరగతి విద్యార్థులకు యూనిట్ పరీక్షలు నిర్వహించారు. కేజీబీవీలో ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ, జెడ్పీ పాఠశాలలో హెచ్‌ఎం విజయలక్ష్మి, గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వరావు పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించి, సీబీఎస్‌ఈ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండలంలో మూడు పాఠశాలల్లోనే సీబీఎస్‌ఈ విధానం అమలు చేస్తున్నట్లు ప్రిన్సిపాళ్లు పేర్కొన్నారు.

జెన్నివారిపల్లెలో విషజ్వరాలు


రోడ్డుపై నిల్వ ఉన్న మురికి నీరు


డెంగీ జ్వరం బారిన పడ్డ హెప్సిబా

బేస్తవారిపేట: మండలంలోని జెన్నివారిపల్లెలో విషజ్వరాలతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులుగా చిన్న పిల్లలు, పెద్దలు జ్వరాలతో మంచం పట్టారు. ఆరేళ్ల పంతగాని హెప్సిబా వారం రోజులుగా డెంగీ జ్వరంతో బాధపడుతూ నంద్యాల ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, మురికి నీరు రోడ్లపైకి చేరి నిల్వ ఉండటంతో మురికి కూపాలుగా మారయని, దుర్వాసన వెదజల్లుతూ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురికి కూపాల్లో దోమలు విపరీతంగా వృద్ధి చెందడంతో జ్వరాలు ప్రబలుతున్నాయని గ్రామస్తులు తెలిపారు.

ఘనంగా జాతీయ వృద్ధుల దినోత్సవం


గోయిందయ్యను సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్లు

పొదిలి: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో వాకింగ్ ట్రాక్ వద్ద బుధవారం జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్, నవ్వుల పువ్వుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ సిటిజన్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు మాచాబత్తుని గోయిందయ్యను ఘనంగా సన్మానించారు. పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి షేక్.మదార్‌వలి మాట్లాడుతూ.. ఎన్నో అనుభవాలను, అనుభూతులను వారసులకు, భవిష్యత్ సమాజానికి పంచే వృద్ధులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. వృద్ధులకు ప్రభుత్వం వీలైనన్ని రాయితీలు ఇవ్వాలని కోరారు. వృద్ధులతో వ్యవహరించాల్సిన తీరు గురించి కవి పావులూరి మల్లికార్జునరావు వివరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు షేక్.బాషామొహిద్దీన్, మూసా జానీ, ముల్లా జిలానీ, ఖాదర్‌బాషా, వెంకట నారాయణ, ముల్లా షుకూర్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

పొదిలి ఎస్సైగా వేమన


ఎస్సై వేమన

పొదిలి: స్థానిక పోలీస్ స్టేషన్ అధికారిగా నూతనంగా నియమితులైన వి.వేమన బుధవారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. బాపట్ల జిల్లాలో పనిచేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా పొదిలిలో నియమితులయ్యారు. నూతన ఎస్సై మాట్లాడుతూ.. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేయడంతోపాటు గస్తీ ముమ్మరం చేస్తామని చెప్పారు.

రహదారి నిర్మాణ పనుల అడ్డగింత

- పరిహారం చెల్లించి పనులు చేయాలని రైతుల డిమాండ్


గోగినేనివారిపాలెంలో రోడ్డుకు అడ్డంగా మట్టి తోలి నిరసన తెలుపుతున్న రైతులు

పొదిలిరూరల్: జాతీయ రహదారి నిర్మాణ పనులను రైతులు అడ్డుకున్నారు. విజయవాడ నుంచి బెంగళూరు వయా కడప మీదుగా ప్రభుత్వం తలపెట్టిన జాతీయ రహదారిలో పొదిలి మండలంలోని గోగినేనివారిపాలెం, తలమళ్ల, ఉప్పలపాడు గ్రామాల పరిధిలోని దాదాపు 200 ఎకరాలను అధికారులు సేకరించారు. ఏడాది క్రితం నిర్మాణ పనులను కేఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ చేపట్టింది. ఆయా గ్రామాల్లో భూములు కోల్పోయిన రైతులకు మొదటి విడతలో 70 ఎకరాలకు పరిహారం అందించారు. రెండో విడతలో 100 ఎకరాలకు పరిహారం రావాల్సి ఉండగా..ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఆగ్రహించిన రైతులు మండలంలోని గోగినేవిరాపిలాఎంలో బుధవారం పనులు అడ్డుకున్నారు. రోడ్డు పనులకు మట్టి తరలించే వాహనాలను నిలిపివేసి నిరసనకు దిగారు. దీంతో సంబంధిత యాజమాన్య పర్యవేక్షకులు వచ్చి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు సత్యమయ్య మృతి


సత్యమయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న అన్నా, ఉడుముల


సత్యమయ్య (ఫైల్)

కొనకనమిట్ల: మండలంలోని మునగపాడు పంచాయతీ బసాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అంకాల సత్యమయ్య(60) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, ఉడుముల శ్రీనివాసులురెడ్డి సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సత్యమయ్య మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, సర్పంచ్ పార్లపల్లి సిద్దానబి, వైఎస్సార్‌సీపీ నాయకులు గర్రె శ్రీనివాసులు, చంద్రశేఖర్, బాలపిచ్చయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదువుకుంటేనే భవిష్యత్తు

రాచర్ల: ఇష్టబడి చదువుకుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎంఈవో-2 వారణాసి గిరిధర్‌శర్మ అన్నారు. మండలంలోని రాచర్లఫారం గ్రామ సమీపంలోని బాలికల గురుకుల పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. తొలుత 10వ తరగతి విద్యార్థినులు రాసే యూనిట్ టెస్ట్ పరీక్షలను పరిశీలించి విద్యార్థులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు ఏర్పాటు చేసే భోజనాన్ని స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంభంలో బంద్ ప్రశాంతం

కంభం: బంద్‌ను పురస్కరించుకొని పట్టణంలోని అన్ని ప్రైవేట్ పాఠసాలలు బుధవారం స్వచ్ఛందంగా మూసివేసారు. ఆర్టీసీ బస్సులు యథావిధిగా నడిచాయి. రాజ్యాంగ సవరణ చెయ్యకుండా విభజించడం సరైంది కాదని మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కల్వకూరి అబ్రహం అన్నారు. బంద్‌కు సహకరించడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పనుల ఎంపికపై దృష్టి సారించాలి

కొనకనమిట్ల: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులను ప్రజాప్రతినిధులతో కలిసి ఎంపిక చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం ఉద్యోగులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 23న గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు. రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

28న మార్కాపురంలో జాబ్‌మేళా

మార్కాపురం: మార్కాపురం సబ్ ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో ఆగస్టు 28న ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు స్థానిక మెప్మా కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జూనియర్ ఎంప్లాయిమెంట్ అధికారి కేవీ రామాంజనేయులు తెలిపారు. కేఎల్ గ్రూప్, అమెజాన్ రిటైల్ రంగంలో వివిధ విభాగాల్లో ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న ఐటీఐ, డిప్లమో, ఎస్‌ఎస్‌సీ, ఇంటర్‌మీడియట్, డిగ్రీ అభ్యర్థులు అర్హులని స్పష్టం చేశారు. ఇంటర్వ్యూకు ఆధార్ కార్డు, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని సూచించారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి


చైర్మన్ ఫిరోజ్ పఠాన్‌ను సన్మానిస్తున్న విలేకరులు

తర్లుపాడు: ఉపాధ్యాయులతో కలిసి పాఠశాలల అభివృద్ధికి నూతన యాజమాన్య కమిటీ కృషి చేయాలని తర్లుపాడు జర్నలిస్టు అసోషియేషన్ అధ్యక్షులు కె.కాశీశ్వరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక హిందూ ఎంపీపీ పాఠశాలలో నూతన ఎస్‌ఎంసీ కమిటీ అధ్యక్షులు ఫిరోజ్ పఠాన్, వైస్ చైర్మన్ వరలక్ష్మిని మండలంలోని విలేకరులు సన్మానించారు. కార్యక్రమంలో విలేకరులతోపాటు హెచ్‌ఎం మస్తానయ్య, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, నజీర్, కృష్ణవేణి, విజయ, వనితాజ్యోతి, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

పొదిలి: మహిళలు, పసిపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని బిట్స్ విద్యా సంస్థల డైరెక్టర్ బెల్లంకొండ విజయలక్ష్మి డిమాండ్ చేశారు. కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ కాలేజీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాయుడు, తోట శ్రీనివాసులు, మద్దులూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.